కాంగ్రెస్‌ను భారీ మెజార్టీతో గెలిపించండి

● సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం అభ్యర్థి దానం నాగేందర్



మాణికేశ్వర్‌నగర్‌లో కమ్యూనిటీ భవనాన్ని ప్రారంభిస్తున్న దానం నాగేందర్ తదితరులు

తార్నాక, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం అభివృద్ధికి కాంగ్రెస్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని ఆ పార్టీ అభ్యర్థి దానం నాగేందర్ కోరారు. శుక్రవారం మాణికేశ్వర్ నగర్‌లో శ్రీరామ గండికోట వడ్డెర కమ్యూనిటీ భవనాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం ఎన్నికల ప్రచారంలో భాగంగా మాణికేశ్వర్‌నగర్‌లో రోడ్‌షో నిర్వహించారు. హస్తం గుర్తుకు ఓటువేసి తనను భారీ మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. 30 సంవత్సరాలుగా ప్రజా సేవకు అంకితమై నగరంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేశానని తెలిపారు. సికింద్రాబాద్ నియోజకవర్గ అభివృద్ధి కోసం కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి చేసిందేమీ లేదన్నారు. సమస్య పరిష్కారంలో విఫలమయ్యారని ఆరోపించారు. తనను గెలిపిస్తే సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల అభివృద్ధికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. మాణికేశ్వర్‌నగర్ బస్తీవాసుల సౌకర్యార్థం రూ. 50 కోట్లతో ప్రభుత్వ ఆస్పత్రి నిర్మాణానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అంగీకారం తెలిపారని అన్నారు. వడ్డెర కార్పొరేషన్ ఏర్పాటుకు ముఖ్యమంత్రి సానుకూలంగా ఉన్నారని చెప్పారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ డిప్యూటీ మేయర్ మోతె శ్రీలతాశోభన్ రెడ్డి, సికింద్రాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆదం సంతోష్, శ్రీరామ గండికోట వడ్డెర సొసైటీ అధ్యక్షుడు గండికోట కుమార్, ప్రధాన కార్యదర్శి జి. కిరణ్, శ్రీనివాస్, వెంకటేశ్, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

దానంకు లక్ష ఓట్లు వచ్చేందుకు కృషి

చిక్కడపల్లి, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి దానం నాగేందర్‌కు ముషీరాబాద్ అసెంబ్లీ నియోజకవర్గంలో లక్ష ఓట్లు వచ్చేందుకు కృషి చేస్తున్నామని ఆ పార్టీ గాంధీనగర్ డివిజన్ అధ్యక్షుడు అభిషేక్ కెన్నడీ తెలిపారు. శుక్రవారం సబర్మతినగర్ సుబాని మసీదు, స్వామి వివేకానందనగర్ అకిల్ షా మసీదులో పార్టీ నేతలతో కలిసి ప్రచారం నిర్వహించారు.

ఈ సందర్భంగా అభిషేక్ కెన్నడీ మాట్లాడుతూ.. ముషీరాబాద్ నియోజకవర్గంలో ముఖ్యంగా గాంధీ నగర్ డివిజన్‌లో కాంగ్రెస్ ఓటు బ్యాంకు చెక్కుచెదరలేదన్నారు. ప్రజలు దానం నాగేందర్‌ను గెలిపించేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. ప్రచారంలో కాంగ్రెస్ నాయకులు గుర్రం శంకర్, చంద్రకళశంకర్, నర్సింగ్‌రావు ముదిరాజ్, హఫీజ్, జగదీశ్, జాన్, మజార్, దినేష్ పాల్గొన్నారు.



చిక్కడపల్లిలో ప్రచారం నిర్వహిస్తున్న కాంగ్రెస్ గాంధీనగర్ డివిజన్ అధ్యక్షుడు కెన్నడీ తదితరులు

మాల ప్రజా సంఘాల జేఏసీ ప్రచారం

పంజాగుట్ట, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం అభ్యర్థి దానం నాగేందర్‌ను గెలిపించాలని కోరుతూ మాల ప్రజా సంఘాల జేఏసీ చైర్మన్ జి. చెన్నయ్య శుక్రవారం పంజాగుట్టలో పలు బస్తీల్లో జేఏసీ నాయకులతో కలిసి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మాలలు, దళిత బహుజనులు దానం నాగేందర్‌ను గెలిపించాలని కోరారు.

ప్రచారంలో వర్కింగ్ చైర్మన్లు పి. భానుప్రకాష్, బూర్గుల వెంకటేశ్వర్లు, రమేష్, మన్నె శ్రీధర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

అడ్డగుట్ట: దానం నాగేందర్‌కు మద్దతుగా కాంగ్రెస్ అడ్డగుట్ట డివిజన్ ఇన్‌చార్జి గంట రాజు ఆధ్వర్యంలో శుక్రవారం మసీదు వద్ద కరపత్రాలు పంచుతూ ప్రచారం చేశారు. కాంగ్రెస్ నేతలు ఎండీ జాఫర్, యూసుఫ్, నాగభూషణం, సుదర్శన్, రమేష్, ఇమ్రాన్ పాల్గొన్నారు.

మాల సంఘాల జేఏసీ మద్దతు

బంజారాహిల్స్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): దానం నాగేందర్‌కు మద్దతు ఇస్తున్నట్లు రాష్ట్ర మాల సంఘాల జేఏసీ ప్రకటించింది. బంజారాహిల్స్ రోడ్డు నెంబరు 14 నందినగర్‌లో జేఏసీ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జేఏసీ చైర్మన్ చెరుకు రాంచందర్ మాట్లాడుతూ.. బడుగు, బలహీన వర్గాల ప్రజలకు సామాజిక న్యాయం జరగాలంటే, రిజర్వేషన్‌లు కాపాడటం కాంగ్రెస్‌తోనే సాధ్యమవుతుందన్నారు. సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలో దానం నాగేందర్ గెలుపునకు ప్రచారం చేయనున్నట్లు స్పష్టం చేశారు. జేఏసీ వైస్ చైర్మన్ ఎస్. నాను, తాలూకా అనిల్, బరిగెల వెంకటస్వామి, ఎడ్ల వెంకటేశ్వర్లు, భిక్షపతి తదితరులు పాల్గొన్నారు

బీఆర్ఎస్.. పేదల జీవితాల్లో వెలుగులు నింపింది

నల్లకుంట, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ పేదల జీవితాల్లో వెలుగులు నింపిందని ఆ పార్టీ సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం అభ్యర్థి టి. పద్మారావుగౌడ్ అన్నారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ హయాంలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను చూసి కారు గుర్తుకు ఓటు వేయాలని ప్రజలను అభ్యర్థించారు. శుక్రవారం రాత్రి గోల్నాక కూరగాయల మార్కెట్, కార్ఖానా గల్లీ, చర్చి వీధి, భాగ్యనగర్, హనుమాన్‌నగర్ తదితర ప్రాంతాలలో ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్‌తో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కేసీఆర్ ఆధ్వర్యంలో ప్రవేశపెట్టిన పథకాలతో కూడిన కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు జి. శంకర్, మూర్తి, ఇర్ఫానా సుల్తాన, స్వప్న తదితరులు పాల్గొన్నారు.



అంబర్‌పేటలో ప్రచారం నిర్వహిస్తున్న పద్మారావుగౌడ్, ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

కాంగ్రెస్, బీజేపీలవి అమలుకాని హామీలు

ఎమ్మెల్యే ముఠా గోపాల్

ముషీరాబాద్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్న బీఆర్ఎస్ అభ్యర్థి టి. పద్మారావుగౌడ్‌ను గెలిపించాలని ఎమ్మెల్యే ముఠాగోపాల్ కోరారు. శుక్రవారం పార్సీగుట్టలో ఏర్పాటు చేసిన బీఆర్ఎస్ పార్లమెంట్ ఎన్నికల కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు. కాంగ్రెస్, బీజేపీ అమలు కాని హామీలు ఇస్తూ ప్రజలను మభ్యపెడుతూ ఓట్లు దండుకోవాలని ప్రయత్నిస్తున్నాయని ఆరోపించారు. బీజేపీ అభ్యర్థి కిషన్‌రెడ్డి ఐదేళ్లుగా ముషీరాబాద్ నియోజకవర్గంలో ఎక్కడా కనిపించలేదని, ఎన్నికలప్పుడు వచ్చి ఓట్లు అడుగుతున్నారని ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర మాజీ కార్యదర్శి ఎడ్ల హరిబాబు యాదవ్, ముషీరాబాద్ డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు శ్రీధర్‌రెడ్డి, ఆకుల అరుణ్‌కుమార్, మీడియాసెల్ ఇన్‌చార్జి ముచ్చకుర్తి ప్రభాకర్, నాయకులు ముఠా జైసింహ, టి. సోమన్, కవాడిగూడ డివిజన్ అధ్యక్షుడు వల్లాల శ్యామ్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్

నేడు ఆర్టీసీ డయల్ యువర్ డీఎం

బర్కత్‌పుర, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ ప్రయాణికులు ఎదుర్కొంటున్న సమస్యలు, సూచనలు, సలహాలకై శనివారం డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు బర్కత్‌పుర డిపో మేనేజర్ ఎం. వేణుగోపాల్ తెలిపారు. సాయంత్రం 3 నుంచి 4 గంటల వరకు ఈ కార్యక్రమం కొనసాగుతుందన్నారు. ప్రయాణికులు 9000406069 ఫోన్ నంబర్‌కు కాల్ చేయాలని కోరారు.

అక్రమంగా ఫీజులు వసూలు చేస్తున్న ప్రైవేట్ కళాశాలలపై చర్యలు తీసుకోవాలి : టీడీపీ

రాంనగర్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలలు అక్రమంగా ఫీజులు వసూలు చేస్తున్నాయని, వాటిపై చర్యలు తీసుకోవాలని టీడీపీ సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం అధ్యక్షుడు పి. సాయిబాబా డిమాండ్ చేశారు. ఫీజు నియంత్రణ చట్టాన్ని కఠినంగా అమలు చేయకపోతే టీడీపీ ఆధ్వర్యంలో ఆందోళన చేపడతామని హెచ్చరించారు. శుక్రవారం టీడీపీ నగర కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యా శాఖ నిబంధనలకు విరుద్ధంగా కొన్ని ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలలు అడ్మిషన్లు ప్రారంభించి లక్షల రూపాయల ఫీజులు వసూలు చేస్తున్నాయని ఆరోపించారు. దీంతో విద్య సామాన్య ప్రజలకు దక్కని ద్రాక్షగా మారిందన్నారు. నర్సరీ విద్యార్థులకు లక్షల రూపాయల ఫీజులు వసూలు చేస్తున్నాయని, దీనిపై ప్రభుత్వ నియంత్రణ లేకపోవడం బాధాకరమన్నారు. సమావేశంలో టీడీపీ సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం ప్రధాన కార్యదర్శులు నల్లెల కిషోర్, పి. బాల్‌రాజ్ గౌడ్, నాయకులు ప్రకాష్, నగు నాగేష్ తదితరులు పాల్గొన్నారు.



మోడల్ ఎప్‌సెట్, నీట్ ప్రశ్నాపత్రాలను విడుదల చేస్తున్న ఎమ్మెల్సీ నర్సిరెడ్డి, ఎస్ఎఫ్ఐ నాయకులు

మోడల్ ఎప్‌సెట్, నీట్ పరీక్షలు విద్యార్థులకు ఉపయోగం

రాంనగర్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నిర్వహించే మోడల్ ఎప్‌సెట్, నీట్ పరీక్షలు విద్యార్థులకు దోహదపడతాయని ఎమ్మెల్సీ ఎ. నర్సిరెడ్డి అన్నారు. శుక్రవారం విద్యానగర్‌లో నానో జూనియర్ కళాశాలలో ప్రశ్నాపత్రాలు విడుదల చేశారు. కార్యక్రమంలో నానో కళాశాలల చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ఆర్ఎల్. మూర్తి, నాగరాజు, సహాయ కార్యదర్శి కిరణ్, నగర అధ్యక్ష, కార్యదర్శులు లెనిన్ గువేరా, అశోక్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆధార్ వివరాలను పరిగణనలోకి తీసుకోవాలి

చిక్కడపల్లి, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో మ్యారేజ్ సర్టిఫికెట్ల కోసం వచ్చేవారు సమర్పించే ఆధార్ వివరాలను పరిగణనలోకి తీసుకోవాలని తెలంగాణ జనసమితి ముషీరాబాద్ కన్వీనర్ మెరుగు శ్రీనివాస్‌యాదవ్ కోరారు. శుక్రవారం మధ్యాహ్నం సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద విలేకరులతో మాట్లాడారు. డేట్ ఆఫ్ బర్త్ కోసం పదో తరగతి సర్టిఫికెట్ తీసుకురావాలంటున్నారని, చదువుకోని వారు ఎలా తీసుకొస్తారని ప్రశ్నించారు.

పుణ్యక్షేత్రాల వివరాలపై వీడియో విడుదల చేయాలనుకోవడం అభినందనీయం

చిక్కడపల్లి, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): విశ్వంభరి మూవీ మేకర్స్ ఆధ్వర్యంలో శుక్రవారం త్యాగరాయగానసభలో స్వర్ణాంధ్ర పుణ్యక్షేత్రాలు ఆడియో, వీడియో సీడీల విడుదల ముహూర్తం సభ జరిగింది. సినీ దర్శకుడు ఎన్. గోపాలకృష్ణ కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. పుణ్యక్షేత్రాలపై ఆడియో, వీడియోలను విడుదల చేసి వాటి వివరాలను ప్రజలకు తెలియజేయాలనుకోవడం అభినందనీయమన్నారు. గాయకుడు త్రినాధరావు, కోట సత్యనారాయణ శాస్త్రి, షేక్ బుర్హాన్, సాయిబాబు, కె. ప్రసాద్‌బాబు, సత్యశ్రీ పాల్గొన్నారు.

సివిల్స్ ర్యాంకర్‌కు సన్మానం

చిక్కడపల్లి, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): ఇటీవలి సివిల్స్ ఫలితాల్లో 780 ర్యాంక్ సాధించిన ఏపీకి చెందిన కానిస్టేబుల్ ఉదయ్‌కృష్ణారెడ్డిని చిక్కడపల్లి పోలీసులు శుక్రవారం సన్మానించారు. ఉదయ్‌కృష్ణారెడ్డి స్ఫూర్తి ఎందరికో ఆదర్శంగా నిలుస్తుందని ఇన్‌స్పెక్టర్ సీతయ్య అన్నారు. కార్యక్రమంలో ఎస్ఐలు శశిపాల్‌రెడ్డి, అభిలాష్, మౌనిక తదితరులు పాల్గొన్నారు.



ఉదయ్‌కృష్ణారెడ్డిని సన్మానిస్తున్న ఇన్‌స్పెక్టర్ సీతయ్య, ఎస్ఐలు

బ్రహ్మకుమారి కేంద్రంలో ఉచిత సమ్మర్ క్యాంప్

చిక్కడపల్లి, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): బ్రహ్మకుమారి కేంద్రం ఆధ్వర్యంలో ఉచిత సమ్మర్ క్యాంప్ శుక్రవారం ప్రారంభించారు. రిలాక్స్ కిడ్స్ పేరిట చిల్డ్రన్స్ సమ్మర్ క్యాంప్‌ను ప్రతిరోజూ సాయంత్రం 5 నుంచి 7 గంటల వరకు 8 నుంచి 14 సంవత్సరాల వయస్సు గల పిల్లలకు జరుగుతుందని కేంద్రం ఇన్‌చార్జి జయశ్రీ తెలిపారు.



సమ్మర్ క్యాంప్‌లో చిన్నారులు

ఇసుక క్వారీల్లో డబ్బులు వసూలు

● కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకోవాలి



టీఎస్ఎండీసీ ఎండీకి వినతిపత్రం అందజేస్తున్న లారీ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు

బర్కత్‌పుర, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో టీఎస్ఎండీసీ (తెలంగాణ స్టేట్ మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్) ద్వారా నిర్వహిస్తున్న ఇసుక క్వారీల్లో కొంతమంది కాంట్రాక్టర్లు, లారీల వద్ద అక్రమంగా డబ్బులు వసూలు చేస్తున్నారని వారిపై చర్యలు తీసుకోవాలని రాష్ట్ర లారీ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు సుర్వి యాదయ్యగౌడ్ డిమాండ్ చేశారు. ఒక్కొక్క లారీ నుంచి కాంట్రాక్టర్లు రూ. 3,500 వసూలు చేస్తున్నారని ఆరోపించారు. శుక్రవారం టీఎస్ఎండీసీ ఎండీ మహేష్‌కు వినతిపత్రం అందజేశామని బర్కత్‌పురాలో విలేకరుల సమావేశంలో వెల్లడించారు. పెద్దపల్లి, భూపాలపల్లి, ములుగు, భద్రాది కొత్తగూడెం ఇసుక క్వారీలలో దొడ్డు, సన్న ఇసుక పేరిట 5 నుంచి 7 వేల రూపాయలు వసూలు చేస్తున్నారని, వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. వేసవి దృష్ట్యా ఇసుక లారీ డ్రైవర్లకు ఫస్ట్ ఎయిడ్ కిట్, తాగు నీరు సదుపాయం క్వారీలలో కల్పించాలని కోరారు. వర్షాకాలంలో ఇసుక కొరత లేకుండా ముందు జాగ్రత్తగా డంపింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు గుండు లింగన్నగౌడ్, లింగస్వామిగౌడ్ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో పలువురి చేరిక

రాంనగర్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): ముషీరాబాద్ నియోజకవర్గానికి చెందిన సంగిశెట్టి జగదీశ్వర్‌రావు ఆయన అనుచరులు రాపోలు రమేష్, రాపోలు నర్సింహ, గజ్జెల సూర్యనారాయణ, సిరిపల్లి శంకర్, నవీన్, నర్సింగ్‌రావు, బాలకృష్ణ, చంద్రమౌళి, కిట్టు, జెల్ల దినేష్, ప్రవీణ్, రఘు, నర్సింహగౌడ్ తదితరులు శుక్రవారం కాంగ్రెస్‌లో చేరారు. వారికి మాజీ ఎమ్మెల్యేలు జగ్గారెడ్డి, కోదండరెడ్డి, ఎమ్మెల్సీ మహేష్‌కుమార్ గౌడ్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

వారు మాట్లాడుతూ.. గతంలో టికెట్ రాలేదని పార్టీ వీడిన సంగిశెట్టి జగదీశ్వర్‌రావు తిరిగి కాంగ్రెస్‌లో చేరడం సంతోషంగా ఉందన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్న దానం నాగేందర్ గెలుపునకు తనవంతు కృషి చేస్తానని అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నేతలు జీఎన్. కేశవ్, అభిషేక్‌రెడ్డి, వేణుగౌడ్, అంజయ్య, రాజు, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

ముషీరాబాద్: యువజన కాంగ్రెస్ కమిటీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అరవింద్ కుమార్ యాదవ్ ఆధ్వర్యంలో భోలక్‌పూర్‌కు చెందిన బీజేపీ మైనార్టీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు సయ్యద్ మసూద్, గ్రేటర్ కమిటీ ఉపాధ్యక్షుడు ఖైరత్ అలీబాబా, భోలక్‌పూర్ డివిజన్ మైనార్టీ మోర్చా ఉపాధ్యక్షుడు యాసిన్, బీఆర్ఎస్ నాయకులు అక్బర్ అలీ, మహ్మద్ ఎజాజ్, అజ్జు తదితరులు శుక్రవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. మాజీ ఎంపీ అంజన్‌కుమార్ యాదవ్ వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

కార్యక్రమంలో భోలక్‌పూర్ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు జహీరుద్దీన్, అల్లావుద్దీన్, జావిద్, నుస్రత్ తదితరులు పాల్గొన్నారు.





జగ్గారెడ్డి, కోదండరెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన సంగిశెట్టి జగదీశ్వర్‌రావు, ఆయన అనుచరులు, కాంగ్రెస్‌లో చేరిన బీజేపీ నాయకులకు కండువాలు కప్పుతున్న అంజన్‌కుమార్ యాదవ్

ఇంటర్ ఫలితాల్లో 'న్యూ ఎరా' విద్యార్థుల ప్రతిభ

రాంనగర్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ ఫలితాల్లో చిక్కడపల్లి న్యూఎరా జూనియర్ కళాశాల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించారని కళాశాల, ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రావణ్‌కుమార్ వెల్లడించారు. మొదటి సంవత్సరంలో ఫలితాల్లో ఎంపీసీ గ్రూప్‌లో రక్షిత 466 మార్కులు, గౌతమ్ 465, బైపీసీలో తులసీశైవి 429, జహబీయ రహీన్ 247, ఎంఈసీలో నిఖితకు 479, మమతకుమారికి 479, సీఈసీ గ్రూప్‌లో అంకితకరణ్ 474, స్పందనకు 469 మార్కులు వచ్చాయని పేర్కొన్నారు. ఇంటర్ ద్వితీయ సంవత్సరంలో ఎంపీసీ గ్రూప్‌లో మానసకు 963 మార్కులు, ఎల్. ధరణిప్రియకు 962, బైపీసీలో కె.భవానీకి 946, వర్షాజైన్‌కు 940, ఎంఈసీలో సంతోషిణికి 978, కె. స్నేహకు 949, సీఈసీ గ్రూప్‌లో నజిమ ఖలోన్‌కు 974, జె. రాజ్‌పురోహిత్ 949 మార్కులు సాధించారని తెలిపారు. విద్యార్థులను ఆయన అభినందించారు. ఉన్నత లక్ష్యాన్ని ఎంచుకొని ముందుకు సాగాలని సూచించారు.



ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు పుష్పగుచ్ఛాలు అందజేసిన న్యూ ఎరా జూనియర్ కళాశాల డైరెక్టర్ డాక్టర్ శ్రావణ్‌కుమార్

మంత్రముగ్ధులను చేసిన ఘంటసాల గాన వైభవం

చిక్కడపల్లి, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): సుప్రీంకోర్టు ప్రముఖ న్యాయవాది డా. జీవీఎన్ఆర్ఎస్ఎస్ఎస్ వరప్రసాద్ ఘంటసాల పాటలు, పద్యాలు, భగవద్గీత శ్లోకాలు అద్భుతంగా ఆలపించి శ్రోతలను మంత్రముగ్ధులను చేశారు. ఘంటసాల గానవైభవాన్ని మరో యాభై ఏళ్లు ముందుకు తీసుకెళ్లే ప్రయత్నంలో భాగంగా శుక్రవారం సాయంత్రం త్యాగరాయగానసభలో ఘంటసాల స్వరామృతధార పేరిట స్వరసామ్రాట్ డా. టి. శరత్‌చంద్ర సంగీత సారథ్యంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వరప్రసాద్‌ను సన్మానించారు. కార్యక్రమ నిర్వాహకురాలు శివరమ్యధరణి ప్రగడకు ఘంటసాల పాటకు చేసిన సేవకు గుర్తింపుగా అభినవ గానకళా సరస్వతి బిరుదు ప్రదానం చేశారు.

పూర్వ న్యాయమూర్తి జస్టిస్ మాధవరావు, సుందరకాండ శ్రీనివాస్, నటుడు కుమారన్, నటి సౌమ్య, తెలంగాణ ఫిలిం చాంబర్ ఆఫ్ కామర్స్ చైర్మన్ ప్రతాని రామకృష్ణగౌడ్, సినీ రచయిత రాజేంద్రప్రసాద్, జీవీఆర్ చౌదరి, నటుడు జెమిని సురేష్, జ్వాల కోటి తదితరులు పాల్గొన్నారు.



వరప్రసాద్‌ను సన్మానిస్తున్న కార్యక్రమ నిర్వాహకులు, అతిథులు

బాలికను వేధించిన యువకుడిపై పోక్సో కేసు

బర్కత్‌పుర, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): ఇన్‌స్టాగ్రామ్‌లో పరిచయమైన ఓ బాలికను ప్రేమ పేరుతో వేధించిన యువకుడిపై కాచిగూడ పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు. ఎస్ఐ నరేష్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. శివరాంపల్లిలో నివసిస్తున్న సాయికిరణ్ అలియాస్ నాని(20) కూలిపని చేస్తుంటాడు. కాచిగూడ ప్రాంతానికి చెందిన ఓ బాలిక ఇన్‌స్టాగ్రామ్‌లో అతడికి పరిచయమవగా ప్రేమ పేరుతో వేధించాడు. బాలిక తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు పోలీసులు నిందితుడిని శుక్రవారం అదుపులోకి తీసుకొని పోక్సో కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.

2 నుంచి హరేకృష్ణ సాంస్కృతిక శిక్షణ శిబిరం



పోస్టర్‌ను విడుదల చేస్తున్న చంద్రదాస ప్రభుజీ

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): హరేకృష్ణ మూవ్‌మెంట్ సాంస్కృతిక విభాగం ఆధ్వర్యంలో మే 2 నుంచి 25వ తేదీ వరకు "సాంస్కృతిక శిక్షణ శిబిరం-2024" నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించిన పోస్టర్, షెడ్యూల్‌ను బంజారాహిల్స్ హరేకృష్ణ స్వర్ణ దేవాలయంలో శుక్రవారం హరేకృష్ణ మూవ్‌మెంట్ హైదరాబాద్ అధ్యక్షుడు సత్య గౌర చంద్రదాస ప్రభుజీ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పిల్లల్లో ఆధ్యాత్మికత, ఆచార వ్యవహారాలను పెంపొందించే లక్ష్యంతో సాంస్కృతిక శిబిరం నిర్వహిస్తున్నామని తెలిపారు. వివరాలకు 81436 55188 ఫోన్ నంబర్‌లో సంప్రదించవచ్చన్నారు.

శిబిరాలు నిర్వహించే ప్రాంతాలు

హరేకృష్ణ గోల్డెన్ టెంపుల్, బంజారాహిల్స్ హరేకృష్ణ హెరిటేజ్ టవర్ - కోకాపేట, హరే కృష్ణ కల్చరల్ సెంటర్-కంది, సంగారెడ్డి, వైశ్య హాస్టల్, కాచిగూడ, మాగ్నాస్ మెజెస్టిక్ మెడోస్, కొల్లూరు, రాజుపుష్ప అట్రియా- గేటెడ్ కమ్యూనిటీ అపార్ట్‌మెంట్స్, కోకాపేట.



కిషన్‌రెడ్డికి మోచి కుల ఆరాధ్య గురువు సంత్ గురు రవిదాస్ మహారాజ్ ఫొటో అందజేస్తున్న సంఘం నేతలు

మోచి కులస్థుల సమస్యల పరిష్కారానికి కృషి

● కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

నల్లకుంట, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): మోచి కులస్థుల న్యాయమైన సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని కేంద్రమంత్రి జి. కిషన్‌రెడ్డి హామీ ఇచ్చారు. శుక్రవారం నల్లకుంటలో సమగర మోచి కుల సంఘం ఆత్మీయ సమ్మేళనం జరిగింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న కిషన్‌రెడ్డి మాట్లాడుతూ..మోచి కుల సర్టిఫికెట్లపై ఎన్నికల తర్వాత రాష్ట్ర ప్రభుత్వం, ఆయా శాఖల అధికారులతో చర్చించి న్యాయం చేస్తామన్నారు. కుల సంఘం అంబర్‌పేట నియోజకవర్గం అధ్యక్షుడు కె. లక్ష్మణ్ కుమార్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో సంఘం నగర అధ్యక్షుడు జి. జితేందర్, సంఘం నాయకులు రాయ్‌కోడ్ సుభాష్, కె. ప్రభురాజ్, పి. నర్సింగ్‌రావు, కె. కైలేష్, ఎం. సురేష్, హెచ్. విష్ణు, హెచ్. రవి పాల్గొన్నారు.

ఎన్నికల ప్రచారంపై కిషన్‌రెడ్డితో తమిళనాడు ఇన్‌చార్జి నమిత చర్చ

సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలో ఎన్నికల ప్రచారంపై ప్రముఖ సినీ హీరోయిన్, బీజేపీ తమిళనాడు రాష్ట్ర ఇన్‌చార్జి నమిత కిషన్‌రెడ్డితో శుక్రవారం చర్చించారు. కార్యక్రమంలో నాయకుడు డాక్టర్ రహమతుల్లా, బీజేపీ మైనారిటీ మోర్చా రాష్ట్ర మీడియా కన్వీనర్ ఎం. ఐజాక్‌రాజ్ పాల్గొన్నారు.

అంబర్‌పేటలో అభివృద్ధిని చూసి బీజేపీకి ఓటేయండి

నల్లకుంట, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం బీజేపీ అభ్యర్థి కిషన్‌రెడ్డి అంబర్‌పేట నియోజకవర్గంలో చేసిన అభివృద్ధి పనులను చూసి కమలం గుర్తుకు ఓట్లు వేయాలని ఆయన సతీమణి కావ్యా కిషన్‌రెడ్డి కోరారు. శుక్రవారం నల్లకుంట డివిజన్ నర్సింహబస్తీ తదితర ప్రాంతాలలో కార్పొరేటర్ వై. అమృతతో కలిసి ఇంటింటికి వెళ్లి బీజేపీకి ఓటు వేయాలని అభ్యర్థించారు.



ప్రచారం చేస్తున్న కావ్యా కిషన్‌రెడ్డి

కిషన్‌రెడ్డిని గెలిపించాలంటూ కరపత్రాల పంపిణీ

ముషీరాబాద్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్న బీజేపీ అభ్యర్థి కిషన్‌రెడ్డిని గెలిపించాలని కోరుతూ శుక్రవారం భోలక్‌పూర్ డివిజన్ మహాత్మానగర్, ఇందిరానగర్‌లో ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బిజ్జి కనకేష్‌కుమార్ కరపత్రాలు పంపిణీ చేశారు. కిషన్‌రెడ్డికి అన్ని వర్గాల ప్రజల మద్దతు ఉందని, విజయం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. బీజేపీ నాయకులు సాయి, బాబు, రాము పాల్గొన్నారు.

బీఆర్ఎస్ ఎన్నికల ఇన్‌చార్జిల నియామకం

రాంనగర్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికలకు ఖైరతాబాద్ నియోజకవర్గం ఇన్‌చార్జిగా బీఆర్ఎస్ గ్రేటర్ సీనియర్ నాయకుడు ఎమ్మెన్ శ్రీనివాస్‌రావు, ముషీరాబాద్ నియోజకవర్గం ఇన్‌చార్జిలుగా మాజీ ఎమ్మెల్యే విష్ణువర్ధన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ సమీవుల్లా, అంబర్‌పేట నియోజకవర్గ ఇన్‌చార్జిగా దాసోజు శ్రవణ్‌ను నియమించారు. వీరి నియామకాన్ని పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ శుక్రవారం ప్రకటించారు.

అంబేడ్కర్ వర్సిటీ పీహెచ్‌డీ కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం 2023-24 విద్యా సంవత్సరానికి పీహెచ్‌డీ కోర్సుల్లో ప్రవేశానికి అర్హులైన వారి నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు విశ్వవిద్యాలయ అధికారులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు విశ్వవిద్యాలయ వెబ్ పోర్టల్ www.braou.ac.in (లేదా) www.braouonline.inలో ఆన్‌లైన్ ద్వారా నమోదు చేసుకోవాలని సూచించారు. ఎంట్రన్స్ ఫీజు రూ.1500, ఎస్సీ, ఎస్టీ దివ్యాంగులకు రూ. 1000 నిర్ణయించినట్లు తెలిపారు. దరఖాస్తులకు మే 3 చివరి తేదీ, పరీక్ష మే 25న హైదరాబాద్ కేంద్రంలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జరుగుతుందని పేర్కొన్నారు. వివరాల కోసం 040-23680411/498/240 ఫోన్ నంబర్లలో సంప్రదించవచ్చని సూచించారు.

అంబేడ్కర్ వర్సిటీ బీఎడ్(ఓడియల్) వెబ్ ఆప్షన్

● చివరి తేదీ ఈనెల 30

అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం 2023-24 విద్యా సంవత్సరానికి బీఎడ్ (ఓడియల్) ఆన్‌లైన్ వెబ్ ఆప్షన్ కోసం ఏప్రిల్ 30వ తేదీలోపు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని విద్యార్థి సేవల విభాగం డైరెక్టర్ డా. ఎల్వీకే రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. మెరిట్ ర్యాంకులు, రిజర్వేషన్ల ప్రకారం సీట్ల కేటాయింపు జరుగుతుందని, ఎంపికైన అభ్యర్థుల జాబితాను మే 8న విశ్వవిద్యాలయ వెబ్‌సైట్‌లో పొందుపరుస్తామని పేర్కొన్నారు.

వివరాలకు విశ్వవిద్యాలయ పోర్టల్ www.braouonline.in లేదా www.braou.ac.inను సందర్శించాలని ఆయన సూచించారు.